# తలరాత

"నావల్ల నీకు నయాపైస వుపయోగం వుండదు. ఎందుకు చేస్తున్నారు యీ ఏర్పాట్లన్నీ" అన్నాడు అడిషనల్ ఇంజనీర్ దయాకర్.

కంట్రాక్టర్ విశ్వనాథం ఇంజనీర్ మాటల్ని పట్టించుకున్న ధోరణిలో లేడు. తనపని తాను తాపీగా చేసుకపోతున్నాడు. టేబుల్ మీద ఒకటొకటే సర్దుతున్నాడు - మందుసీసా, చికెన్‌రోస్ట్‌తో వున్న ప్లేట్లూ, గుడ్లూ, ఐస్....

ఈ ఏర్పాట్లన్నీ చూస్తూంటే దయాకర్‌కు వళ్లు కంపరమెత్తుతున్నది. మందుకొట్టే అలవాటు తనకు లేదనికాదు, కానీ కంట్రాక్టర్ల ఖర్చుమీద మందుకొట్టే అలవాటులేదు. మందు సంగతి అలా వుంచితే కంట్రాక్టర్ల యిళ్లల్లో అన్నం తినే అలవాటుకూడా లేదు. ఉదయం వస్తూ కారియర్‌లో అన్నం తెచ్చుకున్నాడు. కారియర్‌లో అన్నం సర్దుతూ భారతి "అక్కడ హొటల్ లేదా?" అన్నది.

"లేదు పల్లెటూరు." అన్నాడు దయాకర్.

"పోనీ కంట్రాక్టర్ మీ భోజనం యేర్పాట్లు చూడలేడా? మీదంతా మరీ చాదస్తం" అంది నవ్వుతూ.

చాదస్తం అన్నమాట భారతి నోటంట విని దయాకర్ ఒక్క క్షణం దిమ్మెరపోయాడు, ఉక్రోషం వచ్చింది. "చాదస్తం సంగతి యిప్పుడు తెలిసిందా నీకు? లక్షరూపాయల కట్నాన్ని కాలదన్ని నిన్ను పెళ్లిచేసికోవడం చాదస్తమన్నవాళ్లూ వున్నారు. ఆ లెఖ్కన నాకు చాదస్తాలు చాలానే వున్నవి" అన్నాడు దయాకర్.

ఈసారి దిమ్మెరపోవడం భారతి వంతయింది. అంతేకాదు - దయాకర్ వ్యంగ్యంగా అన్నమాట సూటిగా వెళ్ళి భారతి గుండెల్లో గుచ్చుకుంది. కళ్ళల్లో నీళ్లు మెదిలాయి,

"వూరికే యదాలాపంగా అన్నాను. దాన్ని అంత సీరియస్‌గా తీసుకుంటారెందుకు?" అన్నది రుద్ధకంఠంతో

ఈమాటతో దయాకర్ రవ్వంతకూడా సమాధాన పడలేదు. సివిలిజేషన్ అంటూ ఒకటి యేడ్చింది గనుక "అబ్బే, నేనుకూడా తమాషాకే అన్నాను. నువ్వే దాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నావు" అన్నాడు అరువు తెచ్చుకున్న చిరునవ్వుతో.

భారతి గుడ్ల నీరు గక్కుకుంటూనే దయాకర్ పనిదగ్గర చదువుకోడానికి రెండు పుస్తకాలూ, క్యారియర్ అందించింది. భారతిని చూస్తే దయాకర్‌కు జాలి కలగలేదు. సరిగ్గా రెండేళ్లనాటి భారతి - అంటే తన పెళ్లికి ముందు భారతి - జ్ఞాపకం వచ్చింది. ఆరోజుల్లో వేటినైతే ఆదర్శాలుగా అంగీకరించిందో వాటిని యివ్వాళ చాదస్తాల కింద కొట్టి పారవేస్తోంది. మనుషులు ఎందుకిట్లా మారతారా అని ఆలోచించినకొద్దీ మనసు వికలమైంది.

నీతీ నిజాయితీ వున్న నిక్కచ్చి మనిషి చాదస్తుడులాగే కనిపిస్తాడు. ఇంటా బయటకూడా దయాకర్ పరిస్థితి అలాగే వుంది. తన్నుచూస్తే భారతికి నవ్వులాట. ఆఫీసులో తన సహవుద్యోగులు ఇక సరేసరి. అవినీతిని అసహ్యించుకొనేవాళ్లూ, నీతిని ఆదరించే వాళ్లూ లేనప్పుడు వుద్యోగ ధర్మం నిర్వర్తించడమే కష్టమైపోతున్నది. భారతితో ఘర్షణపడి, మనసు పాడుచేసికొని పనిదగ్గరకు రాగానే మళ్లీ అక్కడ ఘర్షణ ప్రారంభమైంది.

దయాకర్ పనిదగ్గర కొచ్చేసరికి విశ్వనాథం కూలీలతో పని చేయిస్తున్నాడు. ఐదారుమంది కూలీలు మెటల్ తెచ్చి మిక్సర్‌లో పోస్తున్నారు. మరో ఐదారుమంది ఇసుక మోస్తున్నారు. మరో పది

మంది మిక్సర్‌నుంచి వచ్చిన కాంక్రీట్‌ను మేస్త్రీ అధ్వర్యంలో వేస్తున్నారు. పనేమో చకచకా సాగిపోతున్నది. పనిలో లేనిదల్లా క్వాలిటీ. మెటల్ జల్లి పట్టించలేదు. ఆ మెటల్ కూడా ఓవర్‌సైజులో వున్నది. మూడు యిసుకా ఒకటి సిమెంట్ పోయాల్సింది ఆరు యిసుకా ఒకటి సిమెంట్ పోయిస్తున్నారు. మోటర్ సైకిల్ మీద నుంచి దిగి ఒక క్షణం అలా పరకాయించి చూడగానే దయాకర్‌కు అక్కడ జరుగుతున్న అవకతవకలు అర్థమయ్యాయి. అగ్గిఫైర్ అయిపోయాడు. అంతా సవ్యంగా జరిగిపోతున్నట్లుగా, ఏమీ పట్టించుకోకుండా పనిని పరికిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిచి, "అలా గుడ్లు మిటకరించి చూస్తూ వుండకపోతే, యీ పని యిలా జరగడానికి వీల్లేదని కంట్రాక్టర్‌తో చెప్పడానికి నీకు నోరు పడిపోయిందా? స్టుపిడ్" అంటూ మండిపడ్డాడు.

వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు ముచ్చెమటలు పోశాయి. నిజానికి పని మొదలు పెట్టగానే వర్క్ ఇన్‌స్పెక్టర్ నంగినంగిగా పేచీ మొదలు పెట్టాడు. పసిబిడ్డ యెందుకేడుస్తున్నదో తల్లి గ్రహించినంత సులభంగా కంట్రాక్టర్ డిపార్టుమెంటువాళ్ల పేచీల అర్థమేమిటో గ్రహించగలడు. వర్క్ ఇన్‌స్పెక్టరుకూ కంట్రాక్టరుకూ మధ్య వున్న పేచీ ఐదు నిమిషాల్లో సర్దుబాటు అయింది.

"మీరు ఎట్లా చేసినా నాకు అభ్యంతరంలేదు. నా బాధల్లా ఆయనొస్తే ఏం చెప్పాలన్నదే. గాట్లో కుక్క బాపతు - తాను తినడు. ఒకరిని తిననివ్వడు. ఆయనతో వేగలేక చస్తున్నాం" అన్నాడు వర్క్ ఇన్‌స్పెక్టరు.

"నీకెందుకు ఆయన విషయం నేను చూసుకుంటాను" అన్నాడు కంట్రాక్టరు విశ్వనాథం. తన ముడుపు తనకు ముట్టింది గనక వర్క్ ఇన్‌స్పెక్టరు గమ్మున వుండిపోయాడు.

"కంట్రాక్టరు యింత గడ్డిపెడితే తిని, చూస్తూ కూర్చున్నావు అవునా?" అన్నాడు దయాకర్.

"మాటిమాటికీ నన్ను కసురుకుంటారెందుకు సార్. నేను చెబితే వినడంలేదు. మీరొచ్చారు గదా పిల్చి చెప్పండి" అన్నాడు. నిల్చున్న చోటునుంచే. ఇంజనీరు దయాకర్ "విశ్వనాథంగారూ, మీరు ఇలా రండి" అంటూ కేకవేశాడు. నిజానికి అది కేకగాదు – గర్జన – మిక్సర్ రొద, కూలీల కోలాహలం – అన్నిటనూ అధిగమించి – ఆ గర్జన విశ్వనాథం చెవుల్లో గింగురుమంది. విశ్వనాథం యేమీ చలించలేదు. తాపీగా, గంభీరంగా నడచుకుంటూ ఇంజనీరు గారి దగ్గరికొచ్చి ఏమిటన్నట్లు చూచాడు,

"విశ్వనాథంగారూ! మీరు ముందు కూలీలతో పని ఆపు చేయించండి. లేదు, ఇలాగే కొనసాగిస్తానంటే నాకు అభ్యంతరం లేదు. నేను వెళ్తున్నాను. ఈ పనికి బిల్లు చేసే ప్రసక్తేరాదు" అన్నాడు ఖరాఖండిగా.

విశ్వనాథం అవాక్కయిపోయాడు. కాసేపటికి తెప్పరిల్లుకొని అన్నాడు. "చూడండిసార్! పది సంవత్సరాలుగా కంట్రాక్టు పనులు చేయిస్తున్నాను. పనిలో క్వాలిటీ మెయిన్‌టెయిన్ చేయడం గురించి మీరు చెప్పనవసరంలేదు. మీరు పర్సంటేజ్ తీసుకోరు. బాగానే వుంది. మీ పై ఆఫీసర్ పర్సంటేజ్ ముట్టందే మెజర్‌మెంటు బుక్కులో సంతకం పెట్టడు. మీ కిందివాళ్లు సరేసరి. డ్రాఫ్ట్స్‌మన్ దగ్గరనుంచీ వర్క్ ఇన్‌స్పెక్టరుదాకా ఎవరిది వాళ్లకు ముట్టకపోతే ఎక్కడ వేసిన "ఎమ్" బుక్కు అక్కడే వుంటుంది. ఇలా అందరికీ పంచుకుంటూ పోవాలంటే – గానుగలోదే గంటెడు అని ఈ వర్కులోనే సర్దాలి. పనిలో క్వాలిటీ మెయిన్‌టెయిన్ చేస్తే నేను ఆరిపోతాను" అన్నాడు.

"అవన్నీ మిమ్మల్ని నేను అడగడంలేదు."

"మరి మా సాధక బాధకాలు ఆలోచించకపోతే ఎట్లా?"

కంట్రాక్టరు విశ్వనాథం ప్రశ్నలకు ఇంజనీరుగారి దగ్గర సమాధానాలు లేవు. కానీ గంటసేపు ఘర్షణ తర్వాత కంట్రాక్టరు

తాత్కాలిక ఓటమిని అంగీకరించకతప్పలేదు. కూలీలను పిలిచి పని ఆపుచేయించాడు. కూలీలు వెళ్లి భోజనాలకు కూర్చున్నారు. ఎండ మిర్రిమిర్రి కాస్తున్నది. యేదన్నా చెట్టునీడకు వెళ్లి కారియర్‌లో తెచ్చుకున్న అన్నం తినడానికి చూస్తున్నాడు ఇంజనీరు దయాకర్.

"మీరు యేమీ అనుకోకపోతే ఒకమాట." అన్నాడు విశ్వనాథం.

"చెప్పండి"

"వర్కు మీరు చెప్పినట్లే చేస్తాను. లాభం రాకపోతేమానె నష్టమైనా వస్తుంది. దానికి నేను సంతోషిస్తాను. ఇంటి దగ్గ భోజనం యేర్పాట్లు చేశాను. మీరు రాకపోతే మట్టుకు బాధపడ వలసి వుంటుంది" అన్నాడు. దయాకర్ కాసేపు సందిగ్ధంలో పడ్డాడు. నీళ్లూ అవీ సర్ది కారియర్ నుంచి అన్నం తీసిపెట్టవలసిన వర్కు ఇన్‌స్పెక్టరు దూరాన నిలబడి ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నాడు. వర్కు ఇన్‌స్పెక్టరు నుంచి సహాయ నిరాకరణ ప్రారంభమైందన్న మాట! దయాకరుకు వర్కు ఇన్‌స్పెక్టరుమీద కోపం వస్తోంది. ఇంటి దగ్గర భార్య భారతిమీద కోపం వస్తోంది. మనసులో ఏవో గజిబిజి ఆలోచనలు – ఒకదానికీ మరొకదానికీ పొంతన కుదరటం లేదు.

"ఏమిటాలోచిస్తున్నారు? అన్నంలో విషం కలుపుతానని భయమా?" అన్నాడు విశ్వనాథం.

"ఎందుకంత నిష్టురంగా మాట్లాడుతారు? వస్తున్నాను పదండి" అన్నాడు ఆలోచనల్నుంచి తేరుకొని.

తీరా వచ్చిన తర్వాత - విశ్వనాథం చేస్తున్న యేర్పాట్లు అతనికి నచ్చలేదు. ఆమాటే విశ్వనాథంతో అన్నాడు. విశ్వనాథం వినిపించుకోలేదు. సరిగ్గా యిద్దరూ అట్లా మల్లగుల్లాలు పడుతుండగా ఎవరో వాకిలి తడుతున్న శబ్దం.

"ఎవరూ?" అన్నాడు విశ్వనాథం.

"నేనురా విశ్వనాథం" అంటూ ముసలాయన లోపలికి వచ్చాడు.

"నువ్వా, పెదనాన్నా! దా. దా. భోజనానికి కూర్చుంటున్నాం సమయానికి వచ్చావు. కాళ్లు కడుక్కొని రా. నువ్వూ మాతోబాటూ భోంచేద్దువుగాని" అన్నాడు.

"భోజనం చెయ్యడానికి అభ్యంతర మేముందిరా, ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవడంలేదు. ఒక వంద యింటికి పంపురా. నేను యిక్కడే భోంచేస్తాను" అన్నాడు ముసలాయన.

జేబులో వున్న వంద కాగితం తీసి, ముసలాయన ఇంటికి పంపాడు విశ్వనాథం.

"ఆ పెద్దాయనకులాగే నాకూ అన్నం వడ్డించండి. నేను డ్రింకు తీసికోను" అన్నాడు దయాకరం.

"మీరు డ్రింకు తీసుకుంటేనే నాకు తృప్తి" అన్నాడు విశ్వనాథం.

"ఏమిటీ గొడవ?" అన్నాడు ముసలాయన.

విశ్వనాథం అంతా వివరించి "వర్కు విషయం అలా చేశాడు. భోజనం దగ్గర యిలా మాట్లాడుతున్నాడు. నువ్వన్నా చెప్పు పెద నాన్నా ఇంజనీరుగారికి" అన్నాడు.

ముసలాయన పగలబడి నవ్వాడు.

ఆ ముసలాయన అట్లా ఎందుకు పగలబడి నవ్వుతున్నాడో దయాకర్‌కు అర్థం కాలేదు. కొంతమందికి సందర్భశుద్ధి అన్నది లేకుండా మాటమాటకూ నవ్వడం అలవాటు. ఈయనా అలాటి వాడేమో ననిపించింది.

"ఏం చేస్తుంటారు మీరు?" అన్నాడు దయాకరం.

"ఏమీ చెయ్యను"

మధ్యలో విశ్వనాథం జోక్యం కలుగచేసికొని, "మా పెదనాన్న గారు. స్వాతంత్ర్య సమరయోధుడండీ. నాకు అక్షర జ్ఞానం నేర్పిన గురువుగారుకూడా ఈయనే" అన్నాడు.

"అంటే మీరు టీచరుకూడానా?" అన్నాడు దయాకరం.

ముసలాయన మళ్లీ పగలబడి నవ్వాడు.

"లేదు బాబూ! వయోజనుల కోసమని ఈ కుగ్రామంలో కొన్నేండ్లపాటు రాత్రి పాఠశాల నడిపాను. ఆ రోజుల్లో ఈ విశ్వనాథంగాడు ఎద్దుముడ్డి పొడుచుకొని బ్రతుకు వెళ్లమారుస్తుండేవాడు. నా దగ్గరే అ. ఆలు. దిద్దుకున్నాడు. ఒక్కొక్కమెట్టే పైకి వెళ్లి మెట్రిక్ పాస్ అయ్యాడు. ఆ తర్వాత కంట్రాక్టరుగా మారి చూస్తున్నారుగా ఈ భవంతీ - ఇందులో వున్న స్టేటస్ సింబల్స్ - లక్షలు సంపాదించాడు" అంటూ నవ్వాడు.

"మీదగ్గర రాత నేర్చుకొని తలరాత మార్చుకున్నాడన్న మాట" అన్నాడు దయాకర్. ముసలాయన తల అడ్డంగా తిప్పి "నాకు అంత గొప్పదనం ఆపాదించకు. రాత నేను నేర్పాను. తలరాత మార్చుకోవడం ఎలాగో వ్యవస్థ నేర్పింది" అన్నాడు.

దయాకరం కళ్లు మూసుకొని ఆలోచనలో పడ్డాడు. మనసు ఉద్విగ్నమైంది. కారణం అతనికే తెలియడంలేదు. విస్కీ, గ్లాసులో పోసి విశ్వనాథం దయాకరుకు అందించాడు. ప్రతిఘటించే శక్తి నశించినట్లయి - గ్లాసు అందుకున్నాడు. సరిగ్గా ఈ టయమ్‌లోనే అక్కడ కూలీలు భోంచేసి మేస్త్రీ అధ్వర్యంలో మళ్లీ పని మొదలు పెట్టారు!

— —